## క్లుప్తంగా

### పురాతన ఆలయ నిర్మాణానికి కృషి


పురాతన శివలింగాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: మండలంలోని చుక్కలనిడిగల్లులో పురాతన శివాలయ అభివృద్ధికి కృషి చేస్తానని శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ అంజూరు శ్రీనివాసులు తెలిపారు. చుక్కలనిడిగల్లు ఎస్టీ కాలనీలో ఉన్న పురాతన శివలింగాన్ని శుక్రవారం శ్రీనివాసులు పరిశీలించారు. ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో పురాతన శివాలయ ఆనవాళ్లు కనిపిస్తున్నాయని, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి శ్రీవాణి ట్రస్టు ద్వారా నిధులు మంజూరు చేయించి ఆలయ నిర్మాణానికి కృషి చేస్తామని చెప్పారు. అదే విధంగా వెలంపాడు, ఎంపేడు గ్రామాల్లో శివాలయాలు, తొండమ నాడు శివాలయాలను పునఃనిర్మాణం చేసేలా కృషి చేస్తామన్నారు. సర్పంచ్ చుక్కల కిరణ్, ఉపసర్పంచ్ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఆలయ భూముల పరిశీలన**

చుక్కల నిడిగల్లు గ్రామంలో శ్రీకాళహస్తీశ్వరాలయానికి చెందిన 42 ఎకరాల భూమిని పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 42 ఎకరాల్లో తైలం చెట్లు పెంచుతుండగా, ఇటీవల తుపాన్ ధాటికి 18 ఎకరాల్లోని చెట్లు ఒరిగిపోయా యని పేర్కొన్నారు. అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### వంద శాతం పింఛన్ల పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో గురు, శుక్రవారాల్లో ఇంటింటికీ వెళ్లి సామాజిక పింఛన్లను వలంటీర్లు వంద శాతం పంపిణీ చేశారని ఎంపీడీఓ కార్యాలయ ఏఓ త్రివిక్రమ్ రావు తెలిపారు. ఉదయం ఐదు గంటల నుంచే వలంటీర్లు పంపిణీని ప్రారంభించారని పేర్కొన్నారు.

### పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



కేవీబీపురం: మితిమీరిన వేగంతో వచ్చిన కారు గేదెను తప్పించే ప్రయత్నంలో పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. మండలంలోని పెరిందేశం గ్రామ సమీపంలో పిచ్చాటూరు– శ్రీకాళహస్తి మార్గంలో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రమాదం జరిగిన వెంటనే కారును అక్కడే వదిలేసి అందులో ఉన్న వారు పరారయ్యారు. పోలీసులకు సమాచారం లేదు.

### వైభవంగా శుక్రవార ఉత్సవం


ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శ్రీజ్ఞానప్రసూనాంబ అమ్మవారికి శుక్రవార ఉత్సవం వైభవంగా జరిగింది. ముందుగా అమ్మవారికి పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సుందరంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారి ఉత్సవ మూర్తిని సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు చేశారు. మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ అమ్మవారిని ఆలయ ప్రాకారంలో ఊరేగించారు.

### మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం


సాయం అందిస్తున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నిరుపేదలు ఎవరు చనిపోయినా ఆ కుటుంబానికి రూ.10వేలు సాయం చేసి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మానవత్వం చాటుకుంటున్నారు. తొట్టంబేడు మండలం పెద్దసింగమాల గ్రామానికి చెందిన సుబ్బరాయలు, భాస్కర్, నడిపయ్య ఇటీవల మరణించారు. శుక్రవారం వారి కుటుంబాలకు రూ.10వేలు వంతున ఎమ్మెల్యే సతీమణి బియ్యపు శ్రీవాణి రెడ్డి అందజేశారు.

### కాలువ పనులు ప్రారంభం

నాగలాపురం: వెస్టు దళితవాడలో శుక్రవారం ఎంపీపీ సింధూ శ్యామ్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. డ్రైనేజీ వ్యవస్థ లేక పోవడంతో వర్షం వస్తే నీరు ఇళ్లలోకి వస్తున్నాయి.దీంతో డ్రైనేజీ పనులు ప్రారంభించారు.

### వైఎస్సార్ బీమా అందజేత

వరదయ్యపాళెం: మండలంలోని ఇందిరానగర్ పంచాయతీ పద్మావతిపురం గ్రామానికి చెందిన ధారా రాంప్రసాద్ కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10 వేలను సర్పంచ్ వీరభద్రం అందించారు. ఇటీవల రాంప్రసాద్ ప్రమాదవశాత్తు చెన్నైలో మరణించాడు. సర్పంచ్ మాట్లాడుతూ మిగిలిన రూ.4.90లక్షలు ఖాతాకు జమ అవుతుందని తెలిపారు.

# ఆరోగ్య సురక్ష.. పేదలకు రక్ష


పిచ్చాటూరు: ఆరోగ్యశ్రీ కిట్లను పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


బీఎన్‌కండ్రిగ: గాజులపెళ్లూరులో కంటి వైద్య పరీక్షలు

పిచ్చాటూరు: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామీణ పేదలకు ఇంటి వద్దే వైద్యం అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యురాలు విష్ణుప్రియ అన్నారు. శుక్రవారం మండలంలోని కారూరు సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష -2 వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో చిన్నపిల్లల స్పెషలిస్ట్ డాక్టర్ భార్గవ్, జనరల్ సర్జన్ డాక్టర్ పూజ, పీహెచ్‌సీ డాక్టర్ హమీద్, మునిచరిత్ర 318 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 37 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విష్ణుప్రియ మాట్లాడుతూ ఇంత పెద్ద ఎత్తున ప్రభుత్వ వైద్యం ఎప్పుడైనా అందిందా.. అని ప్రజలను ప్రశ్నించారు. ఇలాంటి పథకాలు కొనసాగాలంటే జగనన్న మళ్లీ సీఎం కావాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రజలందరూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించాలని కోరారు. వైఎస్‌ఆర్ ఆరోగ్య శ్రీ కిట్లను అధికారులు, ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, సర్పంచ్‌లు నారాయణమ్మ, కిరణ్‌కుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు, పార్టీ మండల అధ్యక్షుడు కె.వెంకటచలపతిరాజు, ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, ఎంపీటీసీ సభ్యుడు రమేష్ రాజు, సచివాలయ కన్వీనర్ మునిచంద్ర శేఖర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

**చల్లపాళెంలో..**

శ్రీకాళహస్తి: మండలంలోని చల్లపాళెం గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వయ్యాల కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. అనంతరం శిబిరానికి విచ్చేసిన వారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. నాయకులు మావిళ్లపల్లి వెంకటేష్‌నాయుడు, హరిరెడ్డి, పనపాక వెంకటేశ్వరరావు, వయ్యాల మనోహర్‌రెడ్డి, రామచంద్రయ్య పాల్గొన్నారు.

**ఆలత్తూరు గ్రామ సచివాలయంలో..**

బుచ్చినాయుడుకండ్రిగ: జగనన్న ఆరోగ్య సురక్షతో ఇంటి వద్దే మెరుగైన వైద్యం అందుతోందని, ఇది పేదలకు రక్ష అని వైద్యాధికారి దివాకర్ తెలిపారు. మండలంలోని ఆలత్తూరు గ్రామ సచివాలయం వైఎస్సార్ క్లినిక్ వద్ద శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పైసా ఖర్చు లేకుండా ఉచితంగా 7 రకాల పరీక్షలు చేసి, మందులు ఇస్తున్నట్లు తెలిపారు. షుగర్, బీపీ, రక్త పరీక్షలు చేశారు. బాలింతలు, గర్భిణులకు, దీర్ఘకాలిక వ్యాధులు, తగిన బరువు లేని పిల్లలు, క్షయ, కుష్టు, వ్యాధులు కలిగిన వారికి ప్రత్యేక వైద్య పరీక్షలు చేశారు. వృద్ధులకు కంటి పరీక్షలు చేసి కళ్లద్దాలు పంపిణీ చేశారు. మొత్తం 423 మందికి వైద్య పరీక్షలు చేశారు. సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది, వలంటీర్లు, పాల్గొన్నారు.


వరదయ్యపాళెం: వైద్య పరీక్షలు

**సురక్ష శిబిరానికి విశేష స్పందన**

వరదయ్యపాళెం: మండలంలోని ఇందిరానగర్ సచివాలయం పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 270 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వీరభద్రం మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదల ఆరోగ్య సమస్యలకు గ్రామస్థాయిలో వైద్యం నిర్వహించేందుకు ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని, తద్వారా ఉచితంగా మందులను అందుకోవడంతో పాటు ప్రత్యేక వైద్యులచే వివిధ ఆరోగ్య సమస్యలకు వైద్యం లభిస్తుందని తెలిపారు. వైద్యాధికారులు ఉదయ్‌కుమార్, ద్వైత, జయగోపాల్, ప్రవీణ్, సీనియర్ అసిస్టెంట్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ గ్రూపు రాజకీయాలు బహిర్గతం


మాజీ ఎమ్మెల్యే ఫొటోలు లేని బొజ్జల సుధీర్ ఫ్లెక్సీ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో టీడీపీ తరపున ఏర్పాటు చేస్తున్న ఏ పోస్టరులో కూడా మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీనాయుడు, సత్రవాడ మునిరామయ్య ఫొటోలు కనిపించక పోవడంతో గ్రూపు రాజకీయాలు బహిర్గతమవుతున్నాయి. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి చోటమోటా నాయకుల ఫొటోలతో కూడిన పోస్టర్లను ఏర్పాటు చేస్తున్నారు. సీనియర్ నాయకుడు ఎస్సీవీనాయుడు, బీసీ ఓటర్లను ప్రభావితం చేసే ఆ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే సత్రవాడ మునిరామయ్య ఫొటోలు ఎక్కడా కనబడకూడదని సుధీర్‌రెడ్డి రహస్య ఆంక్షలతోనే ఇలా జరుగుతోందని పార్టీ నాయకులే గుసగుసలాడుతున్నారు. పార్టీ అధిష్టానం టిక్కెట్ ఇంకా కేటాయించక ముందే సుధీర్‌రెడ్డి ఈ విధంగా చేస్తున్నారంటే, టిక్కెట్ కేటాయిస్తే ఎలా ప్రవర్తిస్తారోనని మాజీ ఎమ్మెల్యేల అనుచరులు మదనపడుతున్నారు.

**అభ్యర్థిని నేనే అంటూ వినుత ప్రచారం**

మరోపక్క జనసేన తరపున కోట వినుత ఏర్పాటు చేస్తున్న పోస్టర్లలో కూడా ఎక్కడా నారా చంద్రబాబునాయుడు ఫొటో కనిపించడం లేదు. పవన్ కల్యాణ్‌వల్లే నేడు టీడీపీ బతుకుతోందని, టీడీపీతో జనసేనకు పొత్తు అవసరం లేదని ఆమె స్టేట్‌మెంట్లు ఇస్తున్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా తనకే అవకాశం వస్తుందని, ఎమ్మెల్యే అభ్యర్థి తానేనంటూ ప్రచారం చేస్తున్నారు. వినుత వ్యవహార శైలిపై టీడీపీ నాయకులు ఆగ్రహంతో ఉన్నప్పటికీ సీటు వచ్చే వరకు సమన్వయం పాటించాలని సుధీర్‌రెడ్డి సూచనలతో ఎక్కడా బయటపడడం లేదు. ఎవరికి సీటు వచ్చినా మరొకరిని వాడుకుని ఎన్నికల్లో గెలిచిన తరువాత పక్కన పెట్టాలనే యోచనలో ఉన్నట్లుగా ప్రజలు గుసగుసలాడుతున్నారు.

## వరిలో ఎలుకల నివారణపై అవగాహన


ఎండీపుత్తూరులో డెమో ఇస్తున్న ఏఓ


బీఎన్‌కండ్రిగ : ఎర తయారీని వివరిస్తున్న ఏఓ

ఏర్పేడు: వరిలో ఎలుకల బెడదను బ్రోమోడియోలిన్ మందు పిచికారీతో నివారించవచ్చని ఏఓ షణ్ముగం అన్నారు. శుక్రవారం మండలంలోని విక్రతమాల, రావిళ్లవారికండ్రిగ, గుడిమల్లం, చెల్లూరు, ఎండీపుత్తూరు, బండారుపల్లి, కొత్తవీరాపురం, ముసలిపేడు గ్రామాల్లో వరిలో ఎలుకల నివారణపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ వరిలో పొట్ట దశలో ఎలుకలు చేరుతాయని సూచించారు. బ్రోమోడియోలిన్‌ను నూకలు, నూనెతో పొలం గట్లుపై పిచికారీ చేయాలని చెప్పారు. ప్రభుత్వం మందును రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఎలా పిచికారీ చేయాలో ప్రత్యక్షంగా చూపించారు. వీఏఏ మహేష్, రైతులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాలలో శుక్రవారం వరిపంటలో ఎలుకల నివారణపై మండల వ్యవసాయాధికారి భారతి అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ వరిపంటలో ఎలుకల నివారణకు బ్రోమోడిలిన్ మందు 10 గ్రాములను ఎకరాకు ఎరగా వాడాలని తెలిపారు. ఎర తయారు చేసే విధానాన్ని వివరించారు. అనంతరం బ్రోమోడిలినోను ఉచితంగా రైతులకు పంపిణీ చేశారు. ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

**కాపుగున్నేరిలో..**

శ్రీకాళహస్తి: ఎలుకలను నివారించగలిగితేనే పంట నష్టాన్ని అరికట్టడం సాధ్యమవుతుందని ఏడీఏ (పీపీ) ధనుంజయరెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలం కాపుగున్నేరిలో శుక్రవారం పంటల్లో ఎలుకల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ పంటల్లో ఎలుకల మందు ఎలా పెట్టాలి. ఎలుకల నివారణకు సామూహికంగా చేపట్టాల్సిన చర్యలను వివరించారు. శ్రీకాళహస్తి ఏడీఏ రమేష్‌రెడ్డి, ఏవో సుధాకర్‌రెడ్డి, వీఏఏ పావని పాల్గొన్నారు.

## మాతాశిశు మరణాలను తగ్గించడమే లక్ష్యం


హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సత్యవేడు: గర్భిణుల్లో రక్త హీనతను నివారించి ప్రసవ సమయంలో మాతాశిశు మరణాల శాతం తగ్గించేలా ఆరోగ్యశాఖ సిబ్బంది పనిచేయాలని జిల్లా పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ ఏ.బేబిరాణి తెలిపారు. శుక్రవారం సత్యవేడు పంచాయతీ ఉలవచేనులోని వైఎస్సార్ గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా టాస్క్ ఫోర్సు టీం తనిఖీ చేసింది. కేంద్రం పరిధిలో రక్తహీనత ఉన్న గర్భిణులు, బాలింతలను గుర్తించి రక్త పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో డీపీహెచ్‌ఎన్‌ఓ మాట్లాడుతూ గర్భిణులు రక్త హీనత వల్ల ప్రసవ సమయంలో అనేక సమస్యలు ఎదుర్కొవలసి వస్తుందని తెలిపారు. ఐరన్ అందించే నువ్వులు, కొబ్బరి, బెల్లం, ఆకుకూరలు, డ్రైఫ్రూట్ గింజలు అధికంగా తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పాలు, గుడ్లు, చిక్కీలు, రాగిపిండి, బాలామృతం తప్పని సరిగా తీసుకోవాలన్నారు. జిల్లా గణాంకాధికారి సి.నాగేంద్రకుమార్, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ కె.రవి, ఎంపీహెచ్‌ఈఓ సుబ్రమణ్యం, ఎంఎల్‌హెచ్‌పీ కె.మేఘన పాల్గొన్నారు.

### ముక్కంటి సేవలో నటుడు సత్యప్రకాష్


జ్ఞాపిక అందజేస్తున్న చైర్మన్ శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం సినీనటుడు సత్యప్రకాష్ దర్శించుకున్నారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆయనను ఆశీర్వదించారు. జ్ఞాపిక, తీర్థప్రసాదాలను శ్రీనివాసులు అందజేశారు.

### ఇళ్ల స్థలాలకు పక్కా రిజిస్ట్రేషన్


రిజిస్ట్రేషన్ చేస్తున్న సిబ్బంది

నాగలాపురం: జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ నాగలాపురం-1, సురుటుపల్లి సచివాలయంలో ప్రారంభమైనట్లు ఎంపీడీఓ పీఎంకే బాబు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ పేదలకు సర్వ హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసి ఇస్తోందని తెలిపారు. పంచాయతి కార్యదర్శి నాగరత్నమ్మ, డిజిటల్ అసిస్టెంట్ హరి, వీఆర్వో స్వర్ణ పాల్గొన్నారు.

### ఘనంగా ఆవిర్భావ దినోత్సవం


కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి: పట్టణంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పలువురు నాయకులు మాట్లాడుతూ 1982 ఫిబ్రవరి 2న సంఘం ఆవిర్భవించిందన్నారు. ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారం కోసం ఎంతో కృషి చేస్తోందన్నారు. సంఘ విస్తరణకు మరింత కృషి చేయాలని తెలిపారు. సభ్యులు మునేంద్రాబు, జయచంద్రారెడ్డి, వెంకట కాంతారావు, మునికృష్ణయాదవ్, మంగిరెడ్డి, ప్రకాష్, చిట్టిబాబు, రవి, రామచంద్రయ్య, లోకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బీసీలకు సముచిత స్థానం


మాట్లాడుతున్న బాలాజీరెడ్డి

ఏర్పేడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బీసీలకు సముచిత స్థానం కల్పిస్తోందని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.బాలాజీ రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని పాగాలిలో ఆయన బీసీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు రాజకీయ పదవుల్లో సముచిత స్థానం కల్పించారని వివరించారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి బీసీల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని తెలిపారు. సర్పంచ్ రాజేశ్వరి, రత్నంరెడ్డి, వేలాయుధంరెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, సుబ్రమణ్యం, గెరటారెడ్డి, మునిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## నమో నారసింహా.. నమో భక్తపాల


విశేష అలంకరణలో స్వామి,అమ్మవార్లు

నారాయణవనం: మండలంలోని సింగిరి కోన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం విశేష అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. స్వామి జన్మ నక్షత్రమైన స్వాతిని పురస్కరించుకుని ఉదయం 10 గంటలకు శ్రీదేవీ, భూదేవీ సమేత లక్ష్మీ నరసింహస్వామి మూలవర్లకు అభిషేకాలను నిర్వహించారు. వెండి కవచాలను, సుగంధభరిత పుష్పమాలికలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో గణపతి, నవగ్రహ, సుదర్శన, ధన్వంతరి, మహా విష్ణు హోమాలను ఆగమోక్తంగా నిర్వహించి పూర్ణాహుతిని సమర్పించారు. భక్తులకు వస్త్ర బహుమానంతో పాటు తీర్థ ప్రసాదాలను ట్రస్టీ సభ్యులు గిరిబాబు, భాస్కర్ బాబు అందజేశారు. భక్తులకు అన్నదాన సత్రంలో అన్నప్రసాదాలను అందజేశారు. ట్రస్టీ సభ్యుడు గిరిబాబు మాట్లాడుతూ ప్రతి పౌర్ణమి రోజున ఉభయ నాంచారులతో లక్ష్మీ నరసింహ స్వామికి కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వామి వారి జన్మనక్షత్రం స్వాతి రోజున హోమాలను ఆగమోక్తంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రోజు ఆలయానికి వచ్చే భక్తులకు మూడు పూటలా అన్న ప్రసాదాలను నిత్య అన్నదాన సత్రంలో అందచేస్తున్నట్లు తెలిపారు.

## నయనానందకరంగా ఊంజల్ సేవ


ఉయ్యాల సేవలో సేదతీరుతున్న అమ్మవారు

నారాయణవనం: శ్రీపద్మావతీ అమ్మవారు శుక్రవారం సాయంత్రం ఉయ్యాల సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని సుప్రభాత సేవతో తెరచి నిత్య పూజా కైంకర్యాలను నిర్వహించారు. ఉదయం 7 గంటలకు శ్రీవెంకటేశ్వరస్వామికి, 8 గంటలకు శ్రీపద్మావతీ అమ్మవారికి శుక్రవార అభిషేకాలను పూర్తి చేశారు. సాయంత్రం శ్రీపద్మావతీ అమ్మవారిని సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై అధిష్ఠింపజేశారు. అంతర ప్రాకారంలో ఊరేగిన అమ్మవారు ఊంజల్ మండపంలో ఉయ్యాల సేవ నయనానందకరంగా జరిగింది. భక్తులు కనులారా వీక్షించి తరించారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆర్జితం అధికారి భరత్, ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## శరవేగంగా కుల గణన సర్వే


సత్యవేడు: సర్వేలో సచివాలయ సిబ్బంది

సత్యవేడు: మండలంలోని కుల గణన సర్వే 88.39 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ17 సచివాలయాల పరిధిలో 16,522 గృహాలు ఉండగా, 14,603 గృహాల్లో నివశిస్తున్న ప్రజల వివరాలతో సర్వే పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. సర్వేలో వ్యక్తి పేరు, వయస్సు, వ్యవసాయ భూమి, నివాస భూమి, పశుసంపద, వృత్తి, వ్యక్తి సమాచారం, వివిధ మార్గాల ద్వారా వచ్చే ఆదాయం, కులం, ఉపకులం, మతం, విద్యార్హతలు, ఇంటి రకం, సురక్షిత తాగునీరు, మరుగుదొడ్లు, గ్యాస్ వివరాలు సమగ్రంగా సేకరిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం గాంధీపురంలో నిర్వహించిన కుల గణన సర్వేను ఎంపీడీఓ పరిశీలించారు. ఏఎన్‌ఎం రోస్‌లిన్, ఆశా వర్కర్లు సిద్ధమ్మ, శకుంతల పాల్గొన్నారు.

**రేణిగుంటలో 90శాతం పూర్తి**

రేణిగుంట: కుల గణన సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో విష్ణు చిరంజీవి సూచించారు. మండలంలో ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికీ వెళ్లి సర్వే పారదర్శకంగా చేస్తున్నట్లు ఆయన వివరించారు. మండలంలో ఇప్పటి వరకు 90శాతం కుల గణన పూర్తి అయ్యిందని, మిగిలిన పది శాతం త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఇంటి యజమానులు సర్వేకు సహకరించాలన్నారు.

## కుష్టు వ్యాధి నివారణ అందరి బాధ్యత



సత్యవేడు: అవగాహన ర్యాలీలో వైద్య సిబ్బంది

సత్యవేడు: జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చెన్నేరిలో వ్యాధి నిర్మూలనపై గ్రామస్తులు, విద్యార్థులకు పీహెచ్‌సీ వైద్యాధికారి గుణశేఖర్ అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చర్మంపై ఎరుపు లేదా రాగి రంగు కలిగిన మచ్చలు ఉంటాయని, మచ్చపై స్పర్శ, నొప్పి ఉండదన్నారు. ప్రారంభ దశలో గుర్తించి మందులు తీసుకుంటే వ్యాధి నయమవుతుందని తెలిపారు. ప్రభుత్వాస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఎంపీహెచ్‌ఈఓ సుబ్రమణ్యం, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుల హౌస్ విజిట్


తలారివెట్టులో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో మెరుగైన ఫలితాల కోసం హౌస్ విజిట్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు హెచ్‌ఎం రూపేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని తలారివెట్టు, కల్లివెట్టు, ఎన్‌టీ ఆర్ నగర్ గ్రామాల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, నాదెండ్లమురళి రాత్రి పూట వెళ్లి, చదువుతున్నారా, లేదా, అని పర్యవేక్షించి, విద్యార్థుల సామర్థ్యాలను తల్లిదండ్రులకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాత్రి 7 నుంచి 9 గంటల వరకు హౌస్‌విజిటింగ్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

## సాగునీటికి అడ్డుకట్ట వేశారని ఆందోళన


గంగ కాలువలో దిగి కోవనూరు రైతుల నిరసన

కేవీబీపురం: తమ భూములకు అందల్సిన సాగునీటిని ఎగువనున్న భూస్వాములు అడ్డు కట్ట వేయడంతో పంటలు ఎండిపోతున్నాయని మండలంలోని కోవనూరు, బ్రాహ్మణపల్లె, గుంటిపేడు, అంజూరు, అంగేరి చెరువ, అప్పనగుంట గ్రామాలకు చెందిన సుమారు 200 మంది రైతులు తెలుగు గంగ కాలువలో దిగి శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గంగ కాలువ ద్వారా వచ్చే నీటితో ఏడు గ్రామాలకు చెందిన సుమారు 800 మంది రైతులు రెండు వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. గంగ కాలువ ద్వారా వచ్చే నీటిని లక్ష్మీపురం వద్ద కొందరు భూస్వాములు అడ్డుకట్ట వేసి వారి భూములకు మాత్రమే మళ్లించుకున్నారని పేర్కొన్నారు. జిల్లా అధికారులు స్పందించి భూస్వాములు ఏర్పాటు చేసిన కట్టను తొలగించి, సాగునీటిని దిగువకు విడుదల చేసేలా గంగ అధికారులతో మాట్లాడి తమకు న్యాయం చేయాలని కోరారు.

## స్వామి వివేకానంద జీవితం స్ఫూర్తిదాయకం


రేణిగుంట: సీఆర్‌ఎస్ బృందావన్ పార్క్‌లో వివేకానందకు నివాళి

రేణిగుంట: స్వామి వివేకానందుని జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని రేణిగుంట సీఆర్‌ఎస్ చీఫ్ వర్క్స్ మేనేజర్ దేవసహాయం అన్నారు. వివేకానంద జయంతిని పురస్కరించుకుని శుక్రవారం సీఆర్‌ఎస్ బృందావన్ పార్క్‌లో ఉన్న ఆయన విగ్రహానికి నివాళి అర్పించారు. చీఫ్ వర్క్స్ మేనేజర్ మాట్లాడుతూ 'లెండి... మేల్కొండి' నినాదంతో వివేకానందుడు భారతావనిని చైతన్యపరిచారన్నారు. కమిటీ సభ్యులు నాగరాజు, విజయశేఖర్‌రెడ్డి, శీనప్ప, సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.